సాక్షి
అనంతపురం

మంగళవారం। 8। ఆగస్టు। 2023



చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.120
టమాట ధరలు గరిష్టంగానే కొనసాగుతున్నాయి. కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ఠ ధర రూ.120 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
37.7°/22.3°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

హెచ్చెల్సీకి 1,500 క్యూసెక్కులు



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి జిల్లా వాటాగా 1,500 క్యూసెక్కుల చొప్పున హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయాలని తుంగభద్ర బోర్డుకు ఎస్‌ఈ రాజశేఖర్ ఇండెంట్ ఇచ్చారు. కొద్దిరోజులుగా నీటిని విడుదల చేస్తుండగా 500 క్యూసెక్కుల నుంచి రోజురోజుకూ క్రమంగా నీటిని పెంచుకుంటూ పోతున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 85.535 టీఎంసీలు నీటి నిల్వ ఉండగా 12,582 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయం నుంచి 7,976 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో రూపంలో వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు.

ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌గా బాలాజీ మురారి



నూతన డైరెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల, శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్) డైరెక్టర్‌గా డాక్టర్ బాలాజీ మురారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ కెకె నాగేలే తొమ్మిది నెలలు క్రితం ఉద్యోగ విరమణ చేయడంతో కమలాబాయి ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం సీఐఏఈ (భోపాల్)లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ బాలాజీ మురారిని కేంద్ర ప్రభుత్వం గార్లదిన్నె ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌గా నియమించింది. నూతన డైరెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో సంస్థను అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం ట్రాక్టర్ నగర్ సిబ్బంది నూతన డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు
- 20 నుంచి ఆర్‌బీకే వేదికగా పంపిణీ



ఉలవలు



పెసర

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగుకు అదును ముగియడంతో మిగిలిన విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. 80 శాతం రాయితీతో పెసలు, అలసంద, ఉలవలు, కొర్రలు పంపిణీకి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ప్రధాన పంటలు తక్కువగా సాగులోకి వచ్చిన 26 మండలాల పరిధిలో 11,684 క్వింటాళ్ల ఉలవలు, 1,218 క్వింటాళ్ల పెసలు, 836 క్వింటాళ్ల అలసందలు, 516 క్వింటాళ్ల కొర్రల పంపిణీకి ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. ఈ నెల 14 నాటికి అర్హత కలిగిన రైతుల జాబితా తయారు చేస్తామని తెలిపారు. 20వ తేదీ ఆర్‌బీకే వేదికగా విత్తనాల పంపిణీ చేపడతామన్నారు.

లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక



జిల్లా కమిటీకి ఎన్నికైన సభ్యులు వీరే..

అనంతపురం: ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వీరాయాదవ్, కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షులుగా సూర్యచంద్ర,ప్రసాద్, మలేష్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, పురుషోత్తం, చైతన్య ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు 28 మంది ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, న్యాయశాస్త్ర బోధకులు సమ్మిళిత సంస్థ, భారత రాజ్యాంగం మూల విలువలు, లక్ష్యాలను కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యమన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం రాష్ట్ర శాసనసభలో ప్రైవేటు బిల్లు తేవటానికి, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు తమ వృత్తిపరమైన సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

జీన్స్‌కు మరింత క్రేజీ

అనంతపురం జిల్లా అనగానే పండ్లతోటలు, సిమెంటు పరిశ్రమలతో పాటు జీన్స్ వస్త్రాలు గుర్తుకు వస్తాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారి తర్వాత అంతగా జీన్స్ పరిశ్రమ ఉన్నది రాయదుర్గంలోనే. వేలాదిమంది కార్మికులు ఈ పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు. వివిధ రాష్ట్రాలకు నాణ్యమైన జీన్స్ వస్త్రాలు ఇక్కడి నుంచే వెళుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 'వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్' కింద రాయదుర్గం జీన్స్‌ను ఎంపిక చేసింది. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరిశ్రమకు మరింత గుర్తింపు రానుంది.



రాయదుర్గంలోని ఓ యూనిట్‌లో జీన్స్ ప్యాంట్ల తయారీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వస్త్రాలలో జీన్స్ ఉత్పత్తులకు ఉన్న క్రేజీయే వేరు. నాణ్యత, అధునాతన డిజైన్లతో కూడిన జీన్స్ ప్యాంట్ల తయారీకి రాయదుర్గం ప్రాంతం ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ జీన్స్ వస్త్రం, ప్యాంట్ల జిప్పులు, గుండీలు, దారం వంటి ముడి సరుకును గార్మెంట్స్ యజమానులు చైనా, అహ్మదాబాద్, బిల్వార్, బళ్లారి హోల్‌సేల్ డీలర్ల నుంచి దిగుమతి చేసుకుంటారు. ట్రెండ్స్‌కు అనుగుణంగా స్టిచ్చింగ్ చేస్తారు. ఇక్కడ తయారైన జీన్స్ ప్యాంట్లు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రతో పాటు దేశంలోని ప్రముఖ నగరాలకు ఎగుమతి అవుతాయి.

వెయ్యికి పైగా యూనిట్లు

రాయదుర్గంలో జీన్స్ వస్త్రాల తయారీ యూనిట్లు వెయ్యికి పైనే ఉన్నాయి. అయినా ఈ పరిశ్రమకు ఇప్పటివరకూ అంతగా గుర్తింపు రాలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా 40 వేల మంది కార్మికులు జీన్స్ తయారీలోనే ఉన్నారు. ఇక్కడి నుంచి రోజుకు సగటున 2లక్షలకు పైగా ప్యాంట్లు అధునాతన డిజైన్లతో రూపుదిద్దుకుంటాయి. ఏటా రూ.700 కోట్ల వరకు టర్నోవర్ ఉంటుందని అంచనా. అలాంటి ఈ పరిశ్రమకు గుర్తింపునివ్వాలని సర్కారు భావించింది. ధర్మవరం పట్టు చీరలకు ఎలా అయితే గుర్తింపు లభించిందో ఇకపై దీనికీ అంతే. వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేసిన పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఇస్తారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లలో జిల్లా పేరు.. ఈ జిల్లా ఎందుకు ప్రసిద్ధి అనే విషయంలో జీన్స్‌ను చెబుతారు. దీంతో ఈ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వస్తుంది.

ఓడీ–ఓపీ అంటేనే గుర్తింపు

ఓడీ–ఓపీ (వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్) అనేది దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తయారవుతున్న ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించడం. దేశ వ్యాప్తంగా 762 జిల్లాల్లో 1,102 ఉత్పత్తులను ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో 26 జిల్లాల నుంచి 38 ఉత్పత్తులను ఎంపిక చేశారు. ఇందులో అనంతపురం జిల్లా నుంచి రాయదుర్గం జీన్స్ పరిశ్రమతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలో ధర్మవరం పట్టుచీరలతో పాటు నిమ్మలకుంట తోలుబొమ్మలు ఉన్నాయి. పరిశ్రమల ప్రాచుర్యాన్ని, ప్రాభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే ఓడీ–ఓపీ ముఖ్య ఉద్దేశం. విశేష ప్రాచుర్యం కల్పించడం వల్ల భవిష్యత్‌లో జీన్స్ ప్యాంట్ల మార్కెట్ టర్నోవర్ పెరిగే అవకాశం ఉంది.



రాయదుర్గంలో జీన్స్ యూనిట్లు **1,000** పైగా

రోజూ ప్యాంట్ల తయారీ **2 లక్షల**పైనే

వార్షిక టర్నోవర్ అంచనా రూ.**700** కోట్లు

నియోజకవర్గంలో ఉపాధి **40,000** మంది



స్టిచింగ్ అనంతరం ఫినిషింగ్ వర్క్ చేస్తున్న కార్మికులు



జీన్స్ ప్యాంట్ల ప్యాకింగ్

ఇన్సెంటివ్‌లు ఇచ్చే అవకాశం



వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేసిన ఉత్పత్తులకు ఇకపై ఎక్కువ ప్రచారం లభిస్తుంది. అంతేకాదు ఈ ఉత్పత్తులను మరింతగా పెంచేందుకు ఇన్సెంటివ్‌లు ఇచ్చే ఆలోచన ఉంది. ఇలా జరిగితే ఆయా ఉత్పత్తుల మార్కెట్ విలువ బాగా పెరుగుతుంది. ఎక్కువ మార్కెట్ చేయొచ్చు.

–నాగరాజారావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

గుర్తింపు ఇవ్వడం సంతోషం



దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఉత్పత్తుల్లో రాయదుర్గం జీన్స్ ఉండటం అదృష్టం. సర్కారు ఈ పరిశ్రమను గుర్తించడం వల్ల భవిష్యత్‌లో ఇక్కడి పరిశ్రమకు మరింత మార్కెట్ పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల రాయదుర్గం పేరు నలుదిశలా వ్యాపిస్తుంది.

–కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

బీటెక్ ఫలితాల విడుదల



అనంతపురం:జేఎన్‌టీయూ(ఏ) విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీటెక్ నాల్గవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు, బీ.ఫార్మసీ నాల్గవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య బి.చంద్ర మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షా ఫలితాల కోసం https://jntuaresults.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మట్కా నియంత్రణకు చర్యలు



ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: పేద, సామాన్యుల జీవితాలను ఛిద్రం చేస్తున్న మట్కా నియంత్రణకు చర్యలు చేపట్టామని ఎస్పీ కె.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసుల దాడులు కొనసాగుతున్నాయని సోమవారం మీడియాకు తెలిపారు. మట్కాతో సంబంధం లేని ఎవ్వరిపైనా చర్యలు తీసుకోవడం లేదన్నారు. తాడిపత్రిలో కూడా మట్కాతో సంబంధం ఉన్న వారిపై మాత్రమే చర్యలు చేపట్టామన్నారు. మట్కాతో సంబంధమున్న ఎవరినీ వదలబోమని, అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

11న వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: జిల్లా జైల్లో ఈ నెల 11న వేరుశనగ చెక్క వేలం నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ రహ్మాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాంతీయ జైళ్లశాఖ ఉపశాఖాధికారి (కడప రేంజ్) సమక్షంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు 25 వేల కేజీల వేరుశనగ చెక్కకు వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.22,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తామన్నారు.

చేనేతకు పూర్వ వైభవం

- సీఎం జగన్ ప్రత్యేక కృషితోనే సాధ్యం
- జాతీయ చేనేత దినోత్సవంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే విశ్వ



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే విశ్వ, చేనేతలు

ఉరవకొండ: టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన చేనేతరంగం ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషితో పూర్వవైభవం సంతరించుకుందని కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉరవకొండలోని తొగటవీర క్షత్రియ కల్యాణమండపంలో బహిరంగసభ నిర్వహించారు. ఎంపీపీ చందా చంద్రమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం జగన్ ఎంతో కృషి చేశారన్నారు. టీడీపీ హయాంలో చేనేత రంగానికి రూ.400 కోట్లు కేటాయిస్తే వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలోనే రూ.2,835 కోట్లు కేటాయించిందన్నారు. నేతన్న నేస్తంతో పాటు చేనేత పింఛన్‌లు, ముద్ర రుణాలు మంజూరు చేసి తోడ్పాటునందించిందన్నారు. బడుగుల రాజకీయ ఎదుగుదలకు కృషి చేశారని, బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆదుకున్నారని తెలిపారు. ఎంపీపీ చందా చంద్రమ్మ, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం, రాష్ట్ర నాయకులు ఎంసీ నాగభూషణం, మిడతల చంద్రమౌళి, నిమ్మల వెంకటరమణ, గట్టు ఎర్రిస్వామి, కాసుల ఆంజనేయప్రసాద్, బీరే శివ, నేత కార్మికుల ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యావేత్త బుట్టా నీలకంఠం, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, జెడ్పీటీసీ సభ్యులు ఏసీ పార్వతమ్మ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, సర్పంచ్‌లు లలితమ్మ, మోనాలిసా, నేసే కోదండరామ్, ప్రసాద్, రెడ్డి ఆంజనేయులు, లక్కా ఎర్రిస్వామి, బ్రహ్మయ్య, కొత్తపల్లి హరి, నీలూరి రత్న, అమర్నాథ్ పాల్గొన్నారు.

త్వరలో చేనేత బ్లాక్‌లెవల్ క్లస్టర్ ప్రారంభం

ఉరవకొండలో త్వరలోనే పెన్నోబులేసు చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ ప్రారంభమవుతుందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. క్లస్టర్ ద్వారా 320 చేనేత కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వం కుర్ని కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి 10 సెంట్ల స్థలం, పద్మశాలి కులస్తుల కమ్యూనిటీ భవనం కోసం రూ. కోటి విలువ చేసే స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే 10,525 మంది చేనేత కార్మికులకు 25.26 కోట్లు మంజూరు చేశారన్నారు. చంద్రబాబు హయాంలో చేనేతరంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ఎటువంటి ప్రోత్సాహకాలూ లేకపోవడంతో నేతన్నలు ఉపాధి దొరక 77 మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఆ మృతుల కుటుంబాలను చంద్రబాబు పరామర్శించిన పాపాన పోలేదన్నారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికుల కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారన్నారు. అధికారంలోకి రాగానే మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందించి ఆదుకున్నారన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- విధుల్లో నిర్లక్ష్యం సహించం
- సరుకులు పక్కదారిపడితే చర్యలు
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి



బీకేఎస్ గిరిజన గురుకుల పాఠశాలలో అన్నం వడ్డిస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

అనంతపురం రూరల్/బుక్కరాయసముద్రం/శింగనమల/నార్పల: విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ప్రభుత్వం మెనూలో సమూల మార్పులు తీసుకొచ్చిందని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. మెనూ పక్కాగా పాటించేలా చూడాల్సిన బాధ్యత సంక్షేమశాఖ అధికారులు, హాస్టల్ వార్డెన్లపై ఉందన్నారు. ఆయన సోమవారం అనంతపురంలోని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేశారు. అనంతరం బుక్కరాయసముద్రంలోని జెడ్పీ హైస్కూలు, కొట్టాలపల్లి రోడ్డు సమీపాన ఎస్సీ హాస్టల్, ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, పోతులయ్య వీధి, గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. తర్వాత కేజీబీవీని సందర్శించారు. రేకులకుంట, వెంకటాపురంలోని చౌకధాన్యపు దుకాణాలను పరిశీలించారు. వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లి పిల్లల నైపుణ్యాలను పరీక్షించారు. ఈ ఏడాది టెన్త్‌లో స్కూల్ టాపర్‌గా వచ్చే విద్యార్థులకు తన వంతు గిఫ్ట్‌గా రూ.2 ఇవ్వాలని డబ్బులను హెచ్ఎంకు ఇచ్చారు. అనంతరం నార్పల కేజీబీవీ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. శింగనమల సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి, బస్తాకు ఒకటిన్నర కిలో తక్కువ వస్తే ఎలా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఆ తర్వాత సీడీపీఓ కార్యాలయ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎస్సీ బాలుర వసతిగృహాన్ని, బోయ వీధిలో చౌకధాన్యపు డిపోను తనిఖీ చేసి, స్టాక్‌ను పరిశీలించారు. రేషన్ బియ్యం వేస్తున్న వ్యాను దగ్గరికి వెళ్లి కార్డుదారులతో మాట్లాడారు. అక్కడి నుంచి డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను పరిశీలించి, గర్భిణులకు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని చైర్మన్ సూచించారు. విధుల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలు, వసతిగృహాలు, రేషన్ దుకాణాల్లో ఆహారం, నిత్యావసర సరుకుల్లో అవినీతికి పాల్పడితే టోల్ ఫ్రీ నంబర్ 9490551117కు సమాచారం ఇవ్వాలని, లేకుంటే వీడియోలు, ఫొటోలను అదే నంబరుకు వాట్సాప్ ద్వారా పంపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్‌ఓ శోభారాణి, డీఈఓ సాయిరాం, ఆర్డీఓ మధుసూదన్, సీడీపీఓ ఉమాశంకరమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీలు పాల్గొన్నారు.

నేతన్నకు సంపూర్ణ సహకారం

- కలెక్టర్ గౌతమి
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేత కార్మికురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని కలెక్టర్ గౌతమి స్పష్టం చేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఢిల్లీలోని ప్రగతి మైదాన్ భారత్ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని మాట్లాడారు. వర్చువల్ విధానంలో సాగిన కార్యక్రమానికి అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల చేనేత జౌళి శాఖల ఏడీలు శ్రీరంగం అప్పాజీ, రమేష్, ధర్మవరం చేనేత కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నేతన్నలతో కలెక్టర్ మాట్లాడారు. చేనేతలకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఎన్‌హెచ్‌డీసీ (నేషనల్ హ్యాండ్‌ల్యూమ్ డెవప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా 15 శాతం సబ్సిడీ అందరికీ అందించాలని చేనేత కార్మికులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ అర్హులైన కార్మికులకు సబ్సిడీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని చేనేత జౌళి శాఖ అధికారులను ఆదేశించారు. చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదర్శనకు ఉంచి జిందాని వర్క్ పట్టుచీరను కలెక్టర్ పరిశీలించి చేనేత కార్మికులను అభినందించారు.

ప్రత్యేకశ్రద్ధతో అర్జీలను పరిష్కరించాలి

'స్పందన', 'జగనన్నకు చెబుదాం' అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జేసీ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు ప్రజల నుంచి 427 అర్జీలు స్వీకరించారు.

చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి

అనంతపురం: చేనేత రంగాన్ని మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పోలీస్ కాంప్లెక్స్‌లో ఉన్న ఆప్కో శిల్క్ హౌస్ వద్ద 9వ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేతితో నేసిన పట్టు వస్త్రాలకు ఎంతో డిమాండ్ ఉందన్నారు. తొమ్మిది మంది చేనేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి శ్రీరంగం అప్పాజీ, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధరమూర్తి, తొగటవీర క్షత్రియ డైరెక్టర్ ప్రభావతి, ఆప్కో మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా - ఒకరి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు

చెన్నేకొత్తపల్లి: ఆటో బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చంద మూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ వివరాల మేరకు... ధర్మవరం పట్టణం నుంచి ఎస్.ఎస్.గేట్ వైపు వస్తున్న ఆటో చంద మూరు వద్దకు రాగానే ఆటో డ్రైవర్ అజాగ్రత్తతో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ధర్మవరం మండలం ధర్మపురానికి చెందిన నాగరాజు (33) ఆటో కింద పడటంతో అక్కడి కక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. మృతునికి భార్య కళ్యాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'నకిలీ విద్యార్థులతో సంబంధం లేదు'

అనంతపురం: ఫొటోలు మార్ఫింగ్ చేసి.. నకిలీ ఐడీ కార్డులతో పరీక్ష రాసిన విద్యార్థులకు, తమ కళాశాలకు సంబంధం లేదని తాడిపత్రిలోని సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ బీవీ భాస్కర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూ అనంతపురం బీటెక్ మొదటి సంవత్సరం తొలి సెమిస్టర్ పరీక్షను తాడిపత్రిలో 16 మంది విద్యార్థులు ఒకరికి బదులు మరొకరు రాస్తూ పట్టుబడిన ఉదంతంపై ఆయన స్పందించారు. మాస్ కాపీయింగ్‌కు ఏ కళాశాల విద్యార్థులు పాల్పడినా.. వర్సిటీ తీసుకునే చర్యలకు తాము కూడా సహకరిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకుంటారని, ఈ వ్యవహారంలో మరో కళాశాల జోక్యం తగదని పేర్కొన్నారు.

సేఫ్‌జోన్‌లో అనంత

- బెట్ట వచ్చినా పుష్కలంగా భూగర్భజలాలు
- జిల్లా తాజా సగటు నీటి మట్టం 9.31 మీటర్లు
- ఈ సీజన్‌లో వర్షాల రూపంలో 43 టీఎంసీలు

అనంతపురం అగ్రికల్చర్: గత నాలుగేళ్లు కరువు తీరా వర్షాలు కురిపించిన వరుణుడు ఈసారి కాస్త నెమ్మదించాడు. కొంత వర్షాభావ పరిస్థితుల నడుమ బెట్ట ఏర్పడినా భూగర్భజలాలకు మాత్రం కొదవ లేదు. జిల్లా అంతటా పాతాళ గంగ పుష్కలంగా కనిపిస్తోంది. భూగర్భజలశాఖ తాజాగా 97 ఫిజోమీటర్ల నుంచి సేకరించిన నీటి గణాంకాలు కూడా దీన్ని స్పష్టం చేశాయి.

సురక్షితంగానే భూగర్భ జలాలు

ప్రస్తుతం జిల్లాలో సగటు నీటి మట్టం 9.31 మీటర్లుగా నమోదైంది. 2014–19 మధ్య కాలంలో నీటిమట్టం 20 నుంచి 25 మీటర్లుగా నమోదు కావడం గమనార్హం. అప్పట్లో వాన కోసం పూజలు, యాగాలు చేసినా ఫలించలేదు. అయితే ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. వాన అనగానే పలకరించడం జరుగుతోంది. దీంతో భూగర్భజలాలు కూడా సురక్షితంగానే ఉన్నాయి. భూగర్భజలాల వాడకం యల్లనూరులో అధికంగా ఉండగా మిగతా 30 మండలాలు సేఫ్‌జోన్‌లో ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే దాదాపు జిల్లా అంతటా సురక్షితంగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. యాడికి, డీ.హీరేహాళ్, కణేకల్లు, బెళుగుప్ప, బొమ్మనహాళ్, గుత్తి, పామిడి, పుట్లూరు, శెట్టూరు మండలాల్లో నీటిమట్టం తగ్గినా...మోతాదుకు మించి వాడకం లేనందున సేఫ్‌జోన్‌లోనే ఉన్నాయి. యల్లనూరు మండలంలో మాత్రమే మోతాదుకు మించి వాడుతున్నందున డేంజర్ జోన్‌లో పెట్టారు.



బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లిలో బోరుబావి నుంచి సమృద్ధిగా వస్తున్న నీళ్లు

1,87,610 బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లు

జూన్ 1 నుంచి ప్రారంభమైన ఈ వర్షపు సంవత్సరంలో గత రెండు నెలల్లో 124.9 మి.మీ గానూ కాస్తంత తక్కువగా 119 మి.మీ వర్షం కురిసింది. వర్షం రూపంలో 43 టీఎంసీలు ప్రవహించగా అందులో 5 టీఎంసీలు భూమిలో ఇంకిపోయినట్లు భూగర్భజలశాఖ డీడీ కె.తిప్పేస్వామి తెలిపారు. నెల కిందట సగటు నీటి మట్టం 8.22 మీటర్లుగా నమోదైంది. ఆశించిన స్థాయిలో వర్షం పడకపోవడంతో నీటి మట్టం స్వల్పంగా తగ్గినట్లు పేర్కొన్నారు. ఒక్క మంచి వర్షం కురిస్తే... తిరిగి సాధారణ స్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న 39 టీఎంసీల భూగర్భజలాల్లో 38 శాతం అంటే 15 టీఎంసీలు వాడుతుండగా ఇంకా 24 టీఎంసీలు ఉన్నాయని తెలిపారు. 17 మండలాల్లో 8 మీటర్ల లోపే నీటి మట్టం ఉండగా 10 మండలాల్లో 15 మీటర్ల లోపు నమోదు కాగా కేవలం మూడు మండలాల్లోనే 15 మీటర్లకు పైగా నమోదైనట్లు వివరించారు. 1,87,610 బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లు వస్తుండగా... కేవలం 12 నోటిఫైడ్ గ్రామాల్లోనే నీరు, భూమి, చెట్టు చట్టం (వాల్టా) ప్రకారం కొత్తగా బోరుబావుల తవ్వకం నిషేధం కొనసాగుతోందని స్పష్టం చేశారు.

మండలాల వారీగా తాజా సగటు నీటి మట్టం ఇలా..

మండలం	నీటిమట్టం (మీటర్లలో)	మండలం	నీటిమట్టం (మీటర్లలో)
అనంతపురం	5.30	ఆత్మకూరు	5.29
బీకే సముద్రం	5.52	బెళుగుప్ప	11.20
బొమ్మనహాళ్	11.31	బ్రహ్మసముద్రం	8.30
డీ.హీరేహాళ్	15.21	గార్లదిన్నె	3.05
గుత్తి	10.28	గుమ్మఘట్ట	6.82
గుంతకల్లు	4.30	కళ్యాణదుర్గం	9.93
కంబదూరు	8.70	కణేకల్లు	14.48
కూడేరు	7.68	కుందుర్పి	6.77
నార్పల	5.07	పామిడి	10.91
పెద్దపప్పూరు	0.53	పెద్దవడుగూరు	4.64
పుట్లూరు	11.42	రాప్తాడు	4.71
రాయదుర్గం	6.22	శెట్టూరు	17.42
శింగనమల	5.23	తాడిపత్రి	11.37
ఉరవకొండ	4.71	వజ్రకరూరు	7.28
విడపనకల్లు	4.30	యాడికి	18.26
యల్లనూరు	7.54		

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్పీ కె శ్రీనివాసరావు



పిటీషనరుతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీ కె. శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీసు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే 145 మంది ఎస్పీని కలసి పిటిషన్లను అందించారు. ప్రతి పిటీషనర్‌తోనూ ఎస్పీ మాట్లాడారు. తర్వాత సంబంధిత స్టేషన్‌ల అధికారులతో బాధితులతో కలసి మాట్లాడించారు. వారి సమస్యలను ఓపిగ్గా విని సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. స్పందన పిటీషన్‌లపై నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బాధితుల పక్షాన నిలిచి న్యాయం చేయాలన్నారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. మట్కా మాఫీయాపై ఉక్కుపాదం మోపాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇందులో భాగంగానే తాడిపత్రిలో కూడా మట్కా కేంద్రాలు, నిర్వాహకులపై దాడులు చేస్తున్నామన్నారు. ఈ దందాలో ఎంతటి వారున్నా వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. సామాన్యుడి జీవితాన్ని అతలాకుతలం చేసే మట్కాను రూపు మాపాలన్నదే మా లక్ష్యమన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుంతకల్లు రూరల్: గుత్తి–గుంతకల్లు జాతీయ రహదారిపై గుంతకల్లు మండలంలోని నరసాపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ సుధాకర్ (34) అనే యువకుడు మృతి చెందాడు. పామిడి మండలం, పాల్యం గ్రామానికి చెందిన బోయ సుధాకర్ గుంతకల్లు మండలంలోని దంచర్లకు చెందిన తులసితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దంచర్లకు వచ్చిన సుధాకర్ తిరిగి స్వగ్రామానికి సోమవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో బయలు దేరాడు. గుంతకల్లు మండలంలోని నరసాపురం వద్ద ఎదురుగా వస్తున్న సుమో వాహనాన్ని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెక్కు డ్రా చేసినందుకు దాడి చేశారు

- కొత్తచెరువు ఎంపీడీఓపై ఎస్పీకి ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: కంప్యూటర్ కొనుగోలుకు ఇచ్చిన చెక్కు డ్రా చేసినందుకు తనపై కొత్తచెరువు ఎంపీడీఓ సిద్దారెడ్డి దాడికి పాల్పడ్డారని అనంతపురం కమలానగర్‌లోని డాల్ దుకాణం యజమాని మధు సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆయన వివరాలమేరకు.. ఎంపీడీఓ సిద్దారెడ్డి తన కుమార్తె కోసం కంప్యూటర్ కొనుగోలు చేసి రూ.39,800లకు చెక్కు ఇచ్చారు. 15 రోజుల్లో బ్యాంకులో వేసుకోవాలని సూచించారు. కానీ 15 రోజులు గడిచినా చెక్కు చెల్లుబాటు కాలేదు. అదిగో ఇదిగో అంటూ ఆరు నెలలు గడిచిపోయాయి. అయితే.. ఈ నెల నాల్గో తేదీన బ్యాంకులో చెక్కు వేయగా నగదు ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఐదో తేదీ సాయంత్రం దుకాణం వద్దకు వచ్చి డబ్బు ఎలా డ్రా చేస్తావంటూ అసభ్యంగా మాట్లాడారు. సెల్‌ఫోన్‌ను మీదకు విసిరారు. రిపేరీ చేసి టేబుల్‌పై ఉంచిన ప్రింటర్ పగులగొట్టారు. ఈ ఘటనపై బాధితుడు అనంతపురం టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా.. వారు కేసు నమోదు చేయలేదు. దీంతో సోమవారం జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదు చేశాడు.

'నా భూమి - నా దేశం'ను ఘనంగా నిర్వహించాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో ఈనెల 9 నుంచి 25వ తేదీ వరకు ''నా భూమి- నా దేశం''... ''నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం'' కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం కింద కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ అంశాలపై జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి డివిజన్, మండల, మునిసిపల్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నా భూమి-నా దేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందం కార్యక్రమాలను అన్ని గ్రామ పంచాయతీల్లో, మండల ప్రధాన కార్యాలయాల్లో, పట్టణ ప్రాంతాల్లో విజయవంతంగా నిర్వహించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి

20 వేల ఇళ్లు పూర్తి చేయాలి

ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. సామూహిక గృహ ప్రవేశాల్లో భాగంగా ఈనెల 18లోగా 20,084 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి గృహప్రవేశాలకు సిద్ధం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు కో ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పోస్టులకు బుధవారం (9వ తేదీ) కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కాల్ లెటర్‌లు అందిన అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

కంబదూరు: గోడ కూలి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండల కేంద్రంలోని కోట వీధిలో చోటు చేసుకుంది. కోట కాలనీకి చెందిన వన్నూర్‌స్వామి ఆయన పిల్లలతో కలిసి మరుగుదొడ్ల నిర్మాణం పనులు చేస్తుండగా సమీపంలోని పాత గోడ కూలింది. దీంతో వన్నూర్‌స్వామితో పాటు ఆయన పిల్లలు పూజిత, నందకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని పులగుట్టపల్లి చిన్న తండాకు చెందిన బోయ నాగేంద్ర (35) అనే రైతు సోమవారం పొలంలో నీళ్ల పట్టేందుకు వెళ్లి స్టార్టర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. రూరల్ ఎస్‌ఐ సురేష్ వివరాల మేరకు.. తమకున్న రెండెకరాల పొలంలో నాగేంద్ర అతడి భార్య లక్ష్మి వ్యవసాయం చేసుకుంటూ నలుగురు కుమార్తెలను పోషించుకుంటున్నారు. వేరుశెనగ సాగు చేసిన నాగేంద్ర సోమవారం మధ్యాహ్నం పంటకు నీళ్ల పట్టేందుకు పొలానికి వెళ్లాడు. స్టార్టర్ ఆన్‌చేస్తుండగా విద్యుదాఘానికి గురై మృతిచెందాడు. సాయంత్రం గుర్తించిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.



నాగేంద్ర (ఫైల్)

'అనంత'లో చెలరేగిన చైన్‌స్నాచర్లు

- మూడు చోట్ల బంగారు చైన్ల అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చైన్‌స్నాచర్లు మరోసారి రెచ్చిపోయారు. నగరంలోని రెండు ప్రాంతాలతో పాటు గార్లదిన్నెలోనూ బంగారు చైన్లను అపహరించారు. నగరంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన కాకర్ల రంగమ్మ నాల్గవపోలీసుస్టేషన్‌కు అనుకొని ఉన్న రహదారిపై పాలప్యాకెట్ కోసం దుకాణానికి వెళ్లి ఇంటికి వెళ్తోంది. చైన్‌స్నాచర్లు అదును చూసి ఆమె మెడలోని 3.5 తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు సమీపంలోని నాల్గవ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. జరిగిన విషయాన్ని సీఐ ప్రతాప్‌రెడ్డికి వివరించగా సీఐ రంగంలోకి ప్రత్యేక బృందాలను దింపారు. చైన్‌స్నాచర్ల కోసం గాలింపు ప్రారంభించారు. సమీపంలోని సీసీ కెమెరాల్లో దొంగల కదలికలు రికార్డు అయి ఉండటంతో వాటిని వెలికి తీసే పనిలో పడ్డారు.



గొలుసు లాక్కుని ఉడాయిస్తున్న చైన్‌స్నాచర్లు

వన్‌టౌన్ పరిధిలో..

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గఫూర్ ఆస్పత్రి వన్‌వే రోడ్డుపై తెల్లవారు జాము 5.10 గంటలకు ఇంటి ముందు కళ్లాపి చల్లుతున్న మహిళ మెడలో 1.50 తులాల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. బాధితురాలు గట్టిగా అరచినా ఫలితం లేకపోయింది. అప్పటికే చైన్‌స్నాచర్లు అక్కడి నుంచి ధర్మవరం రహదారి వైపుగా వెళ్లిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చైన్‌స్నాచర్ల ఆనవాళ్ల కోసం గాలిస్తున్నారు.

సిగరెట్ అడుగుతూ...

ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు చైన్‌ను దొంగలు లాక్కెళ్లిన సంఘటన గార్లదిన్నె మండలం కల్లూరు పరిధిలోని అగ్రహారంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. అగ్రహారం గ్రామానికి చెందిన నీలం నీలమ్మ అనే మహిళ చిన్న కిరాణా అంగడి వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తోంది. ఉదయం నీలం నీలమ్మ అంగడిలో ఉండగా ఇద్దరు యువకులు ఎర్రని పల్సర్ బైక్‌లో వచ్చి సిగరెట్ కావాలని అడిగారు. నీలమ్మ సిగరెట్ ఇస్తుండగా ఇదే అదునుగా భావించిన దుండగులు మహిళ మెడలోని 2 తులాల బంగారు చైన్ దొంగలించి ద్విచక్ర వాహనంలో పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చే లోపు వారు పారిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

బైకు రిపేరీపై నైపుణ్య శిక్షణ

కళ్యాణదుర్గం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బైకు రిపేరీ కోర్సుపై నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి శిక్షణ ఉంటుందని, వివరాలకు 9959422884, 6303580397 నంబర్లను సంప్రదించాలన్నారు.

అనుమానాస్పదస్థితిలో విద్యార్థిని మృతి

కనగానపల్లి: మండల పరిధిలోని తగరకుంటలో సోమవారం ఓ విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. ఉరవకొండకు చెందిన భవాని (13) తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. దీంతో ఆమె తగరకుంటలో ఉన్న తన మేనత్త లలితమ్మ దగ్గర ఉంటూ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుకొంటోంది. సోమవారం పాఠశాల నుంచి వచ్చిన భవాని అంగడి వద్ద ఉన్న మేనత్త దగ్గరకు వెళ్లి ఇంటి తాళం చెవి ఇప్పించుకొని ఇంటికి వెళ్లింది. తర్వాత లలితమ్మ ఇంటి లోపలికి వెళ్లి చూడగా భవాని ఇంటిలో ఊయలగా వేసిన చీరతో మెడకు చుట్టుకొని వేలాడుతూ కనిపించింది. కనగానపల్లి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలు భవాని ప్రమాదవశాత్తూ చీర మెడకు చుట్టుకొని మృతి చెందిందా? లేక ఉరేసుకొని చనిపోయిందా? తేలాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో మాజీ విలేకరి మృతి

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్: స్థానిక తపోవనం కూడలి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వీత్రీ యూట్యూబ్ చానల్ మాజీ రిపోర్టర్ బాబా ఫకృద్దీన్ (45) చనిపోయారు. తపోవనం పరిధిలో నివాసం ఉంటున్న బాబా కొంతకాలంగా రిపోర్టర్ వృత్తికి దూరంగా ఉంటూ తండ్రి డాక్యుమెంట్ రైటర్ ఆజాద్‌కు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళుతుండగా ఐచర్ వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు స్పందించి వాహనాన్ని నిలువరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ తెలిపారు.



బాబా ఫకృద్దీన్ (ఫైల్)

మట్కా మాఫియా వెనుక 'తమ్ముళ్లు'

- వారి డైరెక్షన్‌లోనే పోలీసులపై ఆరోపణలు
- గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు !

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సామాజన్యుడి కష్టార్జితాన్ని హారతి కర్పూరంలా దహించి వేస్తున్న మట్కాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ముఖ్యంగా తాడిపత్రిలో టీడీపీ నేతలే రక్షణ కవచంగా నిలవడంతో మట్కా మాఫియా చెలరేగిపోయిందన్న విషయం బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో సీఐ హమీద్‌ఖాన్‌తో పాటు పోలీసులపై కూడా దాడులకు తెగపడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మట్కాను కూకటి వేళ్లతో సహా పెకిలించి వేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పోలీసులే టార్గెట్

తాడిపత్రిలో మట్కా మాఫియాలో కీలక సూత్రధారి అయిన రషీద్ సోదరుడు అబ్దుల్ రజాక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్తిగా ఆటను ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబం ఏకంగా పోలీసులనే టార్గెట్ చేసింది. ఏకంగా సీఐ హమీద్‌ఖాన్ తమను వేధిస్తున్నాడంటూ మొసలి కన్నీరు కారుస్తోంది.

తెరవెనుక రాజకీయ కుట్ర

మట్కా మాఫియాను ఇన్నాళ్లు పెంచి పోషించిన నేతలు ప్రస్తుతం అబ్దుల్ రజాక్ భార్యతో పోలీసుశాఖలోని కీలక అధికారులపై ఆరోపణలు చేయిస్తున్నారు. మానవ హక్కుల సంఘం, ప్రైవేటు కేసుల పేరుతో పోలీసులను బ్లాక్ మెయిల్ చేసి మట్కా సాగించాలని వ్యూహం రచించారు. ఎస్పీ ప్రత్యేక బృందంతో విచారణ జరిపించి వాస్తవాలను గుర్తించినట్లు తెలిసింది. తాడిపత్రి పోలీసులపై అబ్దుల్ రజాక్ సతీమణి తబుసుం చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఎస్పీ శ్రీనివాసరావు తేల్చారు. మట్కా మాఫియాను రక్షించే బాధ్యతలను భుజాన వేసుకున్న టీడీపీ నేతల కథ... స్క్రీన్‌ప్లే..దర్శకత్వాన్ని కూడా పోలీసు ఉన్నతాధికారులు గుర్తించారు.

రైలు కిందపడి వివాహిత ఆత్మహత్య


తాడిపత్రి: మండలంలోని చిన్నపొలమడ గ్రామానికి చెందిన చాపగాళ్ల రమాదేవి (24) అనే వివాహిత పట్టణ శివారులోని ఆటో నగర్ సమీపంలో రైలు కిందపడి సోమవారం ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన రమాదేవిని చిన్నపొడమలకు చెందిన మంజునాథకు ఇచ్చి ఈ యేడాది ఫిబ్రవరిలో వివాహం జరిపించారు. వీరిద్దరూ గతంలోనే ప్రేమించుకోవడంతో పెద్దల సమ్మతితో వివాహం చేశారు. వివాహానికి ముందు వరకు రమాదేవి తాడిపత్రిలోని ఆదర్శ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిపై వార్డెన్‌గా విధులు నిర్వర్తించేది. సోమవారం సాయంత్రం ఇంటిలో భర్త నిద్రిస్తున్న సమయంలో బయటకు వెళ్లిన రమాదేవి తాడిపత్రికి వచ్చి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



మృతురాలు రమాదేవి

గుత్తిలో..

గుత్తి: గుత్తి జీఆర్‌పీ పరిధిలోని పత్తికొండ రోడ్డు రైల్వేగేట్ సమీపంలో బసినేపల్లి వద్ద సోమవారం రామచంద్ర (45) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామానికి చెందిన కురువ రామచంద్ర చెల్లెళ్ల పెళ్లి కోసం, పంట సాగుకు ఇతరుల వద్ద నాలుగు లక్షల రూపాయల దాకా అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మనస్తాపం చెంది బసినేపల్లి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని గుత్తి జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించారు. మృతునికి భార్య సరస్వతి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం



యువకులకు సర్టిఫికెట్లను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగ అన్ని చోట్లా ఘనంగా జరగాలని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్టు శ్రీ హజరత్ అంగర్ వలి – దస్తగిరి సాహెబ్ చిన్నపీర్ల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దీపు బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో వేణుగోపాల నగర్‌లోని ఆటోస్టాండ్ మకానం వద్ద సోమవారం రక్తదాన శిబిరం జరిగింది. 40 మంది యువకులు రక్తదానం చేశారు. జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణమూర్తి, అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సర్దార్ వలి యువతకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాజు, ప్రధాన కార్యదర్శి ఆనంద్, సహాయ కార్యదర్శులు షారుఖ్, శేఖర్, మహ్మద్, దాదు, కరీంమౌలా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విలువైన స్థలంపై విచారణ జరిపించండి



డిప్యూటీ కమిషనర్ సావిత్రితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం క్రైం: నగరంలోని 32వ డివిజన్‌లోని ఆదర్శనగర్‌లో సర్వే నంబర్ 272లో విలువైన స్థలంపై సమగ్ర విచారణ జరిపించాలని కార్పొరేటర్ కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్, వేణు, లక్ష్మోజీ, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, కోనారాజారెడ్డి, కుమార్, రియాజ్, తదితరులు కోరారు. సోమవారం నగరపాలక సంస్థలో జరిగిన స్పందనలో డిప్యూటీ కమిషనర్ సావిత్రికి వినతిపత్రం అందించారు. స్పందనలో మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయి. నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎస్ఈ నాగమోహన్, ఈఈ చంద్రశేఖర్, టీపీఓ శిరీష, మేనేజర్ లక్ష్మీదేవి, సూపరింటెండెంట్లు సంధ్య, దేవశంకర్, విజయ్‌కుమార్, ఖయ్యూం పాల్గొన్నారు.

‘చైతన్య’లో విద్యార్థి ఎన్నికలు



ఎన్నికల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరిస్తున్న చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో సార్వత్రిక ఎన్నికలు తలపించేలా విద్యార్థి ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి హాజరయ్యారు. విద్యార్థులను నాలుగు విభాగాలుగా విభజించారు. పాఠశాల హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ గర్ల్ పోటీకి పలువురు విద్యార్థులు పోటీ పడ్డారు. కింగ్స్ హౌస్, మొగల్స్ హౌస్, ఫెర్రోస్ హౌస్, సీజర్స్ హౌస్‌గా విభజించి కెప్టెన్స్, డిప్యూటీ కెప్టెన్లు, స్పోర్ట్స్, సీసీఏ కెప్టెన్, వైస్ కెప్టెన్లకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు జరిగింది. ఎన్నికల్లో విజేతలను ప్రకటించి, ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, అకడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణ, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, డీన్ సత్యనారాయణ, కోడీన్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

డేటా ఎనలటిక్స్‌తో అపార అవకాశాలు



మాట్లాడుతున్న ఓబులరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం: డేటా అనలిటిక్స్‌తో అపార అవకాశాలు ఉంటాయని ఇథియోపియా ప్రొఫెసర్ జేఎన్‌టీయూ ఓబుల్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి (రిసోర్స్ పర్సన్) అన్నారు. జేఎన్‌టీయూఏ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో డేటా అనిలిటిక్స్ అండ్ అప్లికేషన్ ఆఫ్ వేరియస్ స్టాటిస్టికల్ టూల్స్‌పై సోమవారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్‌గా ఇతియోపియా నుంచి వచ్చిన ఓబులరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి డేటా అనాలిసిస్, వాటిని వినియోగించే పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, జేఎన్‌టీయూఏ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. నారాయణరెడ్డి , అడహాక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బీసీ లక్ష్మన్న, డాక్టర్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరులో వాడవాడలా మొహర్రం ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి కోడిపీర్ల మకానంలో పానకాల జాతర జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, కార్పొరేటర్ లావణ్య ఆత్మీయ అతిథులుగా పాల్గొని, పీర్లను దర్శించుకున్నారు. చక్కెర చదివించి, మొక్కులు తీర్చుకున్నారు. పాతూరు మటన్ వద్ద ఉన్న పీర్ల చావిడి వద్దకు నగరంలోని హిజ్రాలు పానకం దుత్తలు తెచ్చి, అనంతరం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల జాతర సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నా, ఆదామ్, కమర్తాజ్, అర్షద్ అహమద్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. పెద్ద సరిగెత్తు సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు హిందూముస్లింలతో పీర్లచావిడి కిటకిటలాడింది. భక్తులు పానకం దుత్తలతో చావిడికి వచ్చి పీర్లను దర్శించుకున్నారు. అనంతరం చక్కెర చదివింపులు చేయించారు. గ్రామంలో పీర్ల చావడిలో పీర్లను కొలువు దీర్చి, సాంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు చెట్ల మొద్దులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో తీసుకొచ్చి పీర్ల గుండంలోకి వేశారు. మండల కేంద్రంలోని మొహర్రం వేడుకలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూల దండలతో పీర్ల దేవుళ్లను ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి 8 గంటలకు గుండంలో చెట్ల కొమ్మలు కాల్చారు. రాత్రి 10 గంటల నుంచి గ్రామంలో పీర్ల దేవుళ్లను ఊరేగించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు పీర్ల దేవుళ్లను అగ్నిగుండ ప్రవేశం చేయించనున్నట్లు ముల్లాసాహెబ్ పీరా తెలిపారు. అనంతరం సాయంత్రం జలధి కార్యక్రమం ఉంటుందన్నారు. ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాప్తాడులో చావిడిలో కొలువైన పీర్లు



మటన్ మార్కెట్ వద్ద పీర్ల చావిడికి పానకం దుత్తలు తెస్తున్న హిజ్రాలు

తూంచర్లలో ఘనంగా పెద్ద సరిగెత్తు

కనగానపల్లి: మండలంలోని భానుకోటలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా సోమవారం పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. కొలువుదీరిన పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించి, పానకాలు, చెక్కర్ల చదివింపులు చేశారు. భక్తులు ఊరేగింపుగా వెళ్లి పీర్ల స్వాములను దర్శించుకున్నారు. మంగళవారం చివరి రోజు జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.





ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ,రాప్తాడులో మొద్దులు తీసుకెళ్తున్న భక్తులు

సబ్సిడీతో విత్తనాల పంపిణీ

ఆత్మకూరు: రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ విత్తనాలకోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సుచరిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెసర, అలసంద, ఉలవలు 80 శాతం సబ్సిడీతో, రాగులు 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు.

నలుగురు డీబార్

అనంతపురం: ఎస్కేయూ యూజీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ సోమవారం తెలిపారు. అనంతపురంలోని ఓ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు చూసి రాస్తూ పట్టుబడినట్లు ఆయన తెలిపారు.

మిషన్ ఇంద్రధనస్సును సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ దయాకర్ తెలిపారు. మండల వ్యాప్తంగా టీకా వేయించుకోని 23 మంది గర్భిణులు,చిన్నారులను గుర్తించి, టీకా వేసినట్లు తెలిపారు. ఈ నెల 12వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మళ్లీ సెప్టెంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు ఉంటుందన్నారు. మళ్లీ అక్టోబర్ 9 నుంచి 14వరకు మూడు దఫాలుగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సబిహా సుల్తానా, ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, సీహెచ్ఓ శమీం తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి ఆశ్రమం నూతన కమిటీ ఎంపిక

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి మహారాజ్ 62వ తపస్సమాధి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. శారదా నగర్‌లోని బాలయోగి ఆశ్రమంలో సద్గురువులకు విశేష పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులతో ధ్యానం, భజనలు చేయించారు. ఆశ్రమ కమిటీ నూతన అధ్యక్షుడిగా జూటూరు అరవింద్, ఉపాధ్యక్షులుగా రత్నగిరి దేవరాజ్, సురేష్, మల్లికార్జునను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

బీమా సాయం అందజేత

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్లలో తలారి గోపాల్ (37) అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం గోపాల్ భార్య ఈశ్వరమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలు నగదును వైఎస్సార్‌సీపీ నాయకులుఅ ందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు నరసింహ, వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ భర్త పోతన్న, ఎంపీటీసీ భర్త రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

చేనేతల సంక్షేమానికి సీఎం కృషి

రాప్తాడురూరల్: కష్టాల్లో ఉన్న చేనేత కార్మికులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అండగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌లో రాచానపల్లి సర్పంచ్ అంజియాదవ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం దాదాపు 150 బైకుల్లో ర్యాలీ నిర్వహించారు. సిండికేట్‌నగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రాచానపల్లి, అనంతపురం నగరంలోని టవర్‌క్లాక్ వరకు వెళ్లి తిరిగి సిండికేట్‌నగర్‌కు చేరింది. ‘జై జగన్...జైజై జగన్’ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సర్పంచ్ అంజియాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లపాటు చేనేత కార్మికులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు చేనేత కార్మికులకు తీరని ద్రోహం చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, రాచానపల్లి పీఏసీఎస్ చైర్మన్ గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వడ్డే శీనా, గౌస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్లు బాలకృష్ణ, డీలర్ రామాంజనేయులు, నాయకులు ఈశ్వరయ్య, భానుకోట శివ, శ్రీరామిరెడ్డి, కృష్ణాపురం రాము, పరమేష్, వీరేష్, వెంకటేశు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

సీఎం జగన్‌తోనే మైనార్టీల సంక్షేమం

అనంతపురం కల్చరల్: మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని మేయర్ వసీం అన్నారు.సోమవారం ‘హర్ దిల్ మే వైఎస్సార్..హమ్ సబ్ జగన్ కే సాత్’ కార్యక్రమంలో భాగంగా సిండికేట్ నగర్‌లోని నూరానీ మసీదులో ముస్లింలతో సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ వసీం, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. మేయర్ ముస్లిం మైనార్టీ పెద్దలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేకూరుతున్న లబ్ధిపై వివరించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 9 మందికి కార్పొరేటర్లుగా అవకాశం కల్పించారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌సీపీకి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, మసీదు కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అంచనాలు సిద్ధం చేయండి

అనంతపురం క్రైం: అభివృద్ధి పనులకు అంచనాలను సిద్ధం చేయాలని సచివాలయ సిబ్బందిని మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరంలోని 38వ డివిజన్‌లో మేయర్ పర్యటించారు. స్థానిక ప్రజలతో కాసేపు ముచ్చటించారు. ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. దీంతో స్థానికులు కాలువలు శిథిలావస్థకు చేరాయని, కొత్తగా నిర్మించాలని మేయర్‌ను కోరారు. డివిజన్‌లో ఎప్పటికప్పుడు సమస్యలు గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని మేయర్ ఆదేశించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బీబీ ఫాతిమా ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పూజలందుకుంటున్న బీబీ ఫాతిమా పీర్ల ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఐదోరోడ్డు పీర్ల మకానం భక్తులతో కిటకిటలాడుతోంది. సోమవారం ఉదయం ఊరేగింపుగా వెళ్లిన బీబీ ఫాతిమాకు అడుగడుగునా భక్తులు చక్కెర చదివింపులు చదివించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మంగళవారం పెద్ద సరిగెత్తు, బుధవారం అగ్ని గుండ ప్రవేశం, అదేరోజు జలధి కార్యక్రమం ఉంటుందన్నారు.



బీబీ ఫాతిమాను ఊరేగిస్తున్న దృశ్యం

కుష్టు రోగులకు స్క్రీనింగ్

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని కుష్టు వార్డులో రోగులకు శస్త్రచికిత్సల స్క్రీనింగ్ చేశారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పర్యవేక్షణలో పలమనేరు ఏమాస్ ఆస్పత్రి సహకారంతో స్క్రీనింగ్ చేశారు. కుష్టుతో బాధపడుతున్న 20 మందికి స్క్రీనింగ్ చేయగా, అందులో ముగ్గురికి శస్త్రచికిత్స అవసరం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. జిల్లాలోని ఈ నెల 12 వరకు శస్త్రచికిత్స స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అనుపమజేమ్స్ తెలిపారు. ఈ నెల 8న యర్రగుంట, 9న గుంతకల్లు, 10న గుత్తి, 11న తాడిపత్రి, 12న అనంతపురం సర్వజనాస్పత్రిలో ఉచిత స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు ఏమాస్ ఆస్పత్రి ఫిజియోథెరపిస్టు మహబూబ్ బాషా, కుష్టు విభాగం సిబ్బంది నాగన్న, సత్యనారాయణ, సూర్యప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్క్రీనింగ్ క్యాంపును పరిశీలిస్తున్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



గాయపడిన యల్లమ్మ, చిన్నారి, చందు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు వద్ద సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు గాయపడ్డారు. వివరాలు.. బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన జయరాములు, యల్లమ్మ ద్విచక్ర వాహనంపై అనంతపురానికి వెళ్తున్నారు. బ్రహ్మసముద్రం మండలం టీతకల్లు గ్రామానికి చెందిన చందు, అనురాధ, చిన్నారి ద్విచక్ర వాహనంపై అనంతపురానికి వెళ్తున్నారు. పంపనూరు సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనురాధ, యల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చందుతోపాటు చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



చెన్నా రెడ్డి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: అప్పుల బాధతాళలేక రైతు చెన్నారెడ్డి (46) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఒంటికొండలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రైతు చెన్నారెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన పొలంలో మూడు బోర్లు వేసినా అందులో నీరు పడలేదు.పంటల సాగుకు మరో రూ.5 లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గంలేక సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఎంతసేపటికీ చెన్నారెడ్డి ఇంటి తలుపులు తెరవకపోవడంతో స్థానికులు కిటికీలో నుంచి చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు మనోహర్ రెడ్డి కూతురు మానసా ఉన్నారు.

అన్ని విధాలుగా ఆదుకుంటాం..

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నారెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం వారు ఒంటికొండకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించారు.

కారుకు నిప్పు పెట్టిన కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని అశోక్‌నగర్‌లో పార్కింగ్ చేసిన క్రెటా కారుకు నిప్పు పెట్టిన కేసులో వన్‌టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు రజక రామకృష్ణగా గుర్తించారు. వివరాలు.. ఇంట్లో మిగిలిపోయిన అన్నాన్ని లెక్చరర్ చంద్రశేఖర్‌రెడ్డి భార్య .. రజక రామకృష్ణ తల్లికి ఇవ్వబోగా ఆమె నిరాకరించింది. అన్నంత ఇస్తుంటే మీ అమ్మ వద్దనిందని రజక రామకృష్ణపై చంద్రశేఖర్‌రెడ్డి భార్య నిష్ఠూరంగా మాట్లాడిందని, మనసులో పెట్టుకున్న రామకృష్ణ.. నాలుగు రోజుల క్రితం మద్యం మత్తులో ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారుకు నిప్పంటించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. రామకృష్ణ ఇంట్లో ఉన్న కలప దుంగలు, కారు కింద సగం కాలిన దుంగలు ఒకేలా ఉండడంతో రామకృష్ణను పిలిచి విచారించారు. దీంతో రామకృష్ణ తనకు జరిగిన అవమానాన్ని పోలీసులకు తెలిపాడు. తానే కారుకు నిప్పు పెట్టినట్లు అంగీకరించడంతో అతన్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఏఈఓ ఇల్లు దగ్ధం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని లక్ష్మీనగర్‌లో ఓ ఇంట్లో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షలు నగదు, 30 తులాల బంగారం కరిగి ముద్దయ్యింది. ప్రమాదంపై అగ్నిమాపక జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట అగ్రికల్చర్ ఏఈఓగా పనిచేసే నారాయణ స్వామి, అనురాధ దంపతులు లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నారు. నారాయణస్వామి విధులకు వెళ్లాడు. పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో ఇంట్లో అనురాధ ఒక్కరే ఉన్నారు. ఇంట్లో ఉన్నపళంగా మంటలు ఎగిసిపడ్డాయి. ఇళ్లంతా పొగ కమ్మేసింది. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్లను స్థానికులసహాయంతో బయటకు తీసుకొచ్చారు. అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చేలోపు ఇళ్లంతా కాలిపోయింది. ఇంట్లో సామగ్రి, మొత్తం వస్తువులు కాలిబూడిదయ్యాయి. బీరువాలో దాచిన 30 తులాల బంగారం కరిగి ముద్దయ్యింది. రూ.1.50 లక్షల నగదు కాలిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం తెలియరాలేదు. అగ్నిమాపక శాఖ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాలిపోయిన ఇల్లు, వస్తువులు

సంక్షిప్త సమాచారం

మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిరసన

అనంతపురం అర్బన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. రాంభూపాల్ మాట్లాడుతూ కరోనా విపత్కర సమయంలో కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి సేవలు అందించారన్నారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యం కాపాడుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం నాయకులు, కార్మికులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకు పోయేందుకు ప్రయత్నించారు. వారి చర్యలను పోలీసులు అడ్డుకుని నాయకులు, కార్మికులను అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు ఆర్ వీనాయుడు, గురురాజు, మల్లికార్జున, సంజీవరాయుడు, ఎర్రిస్వామి, తిరుమలేశ్ పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసన

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో వీఆర్ఏలు కలెక్టరేట్ ఎదుట సోమవారం దీక్ష చేపట్టారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు ప్రసాద్, పరమేశ్వర్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, సుంకన్న, చిరంజీవి, ఆంజనేయులు, బాలకృష్ణ, పెద్దన్న, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల నిరసన

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఆశా వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు బైఠాయించి సోమవారం నిరసన తెలియజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జేసీ కేతన్‌గార్గ్‌కు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు కృష్ణుడు, ఆశా వర్కర్ల సంఘం నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

అనంతపురం: కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో ఈ నెలాఖరులో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు ఆదివారం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభను కబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడు ఎస్. గురుస్వామి, చైర్మన్ శాంతరాజు, తులసి, కేశవ రామంజి , మణీంద్ర, వెంకటేశులు భరద్వాజ్ , క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అధ్యక్షుడు గురుస్వామి ఆకాంక్షించారు.